

రండి.. కదలిరండి.. తరలిరండి..
రా
కదలి రా!
మార్పు కోసం
తెలుగుదేశం
శ్రీకాకుళం జిల్లాలో
జరుగు
రా..కదలిరా..
కార్యక్రమాన్ని
జయప్రదం చేద్దాం!!
మన భావితరాల భవిష్యత్తు కొరకు అహర్నిశలు శ్రమిస్తూ...
ఎన్ని అడ్డంకులు ఎదురైన ధైర్యంగా, సాహసోపేతంగా ఎదుర్కొంటున్న
మన నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
నాయకత్వాన్ని బలపరిచి, 2024 ఎన్నికల రా.. కదలి రా...
భాగంగా నేడు శ్రీకాకుళం విచ్చేయుచున్న సందర్భంగా
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
స్వాగతం.. సుస్వాగతం...
మామిడి గోవిందరావు
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు
పాతపట్నం నియోజకవర్గం

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

పలాస: పలాస రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి మఖరజోల గ్రామ సమీపంలో ఆదివారం రైలుకింద పడి మందస మండలం సరియాపల్లికి చెందిన దిశప్రధాని రామారావు (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. సంఘటన స్థలానికి రైల్వే పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రసాద్(ఫైల్)

మెళియాపుట్టి: చాంపాపురం గ్రామానికి చెందిన యవ్వారి ప్రసాద్ (35) తంగిని వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం కరజాడ గ్రామం నుంచి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై చాంపాపురం వస్తుండగా గొప్పిలి నుంచి టెక్కలిపట్నం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి అదుపు తప్పి బస్సును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్ గత కొంత కాలంగా మర్చెంట్ నేవీలో పనిచేస్తూ ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడన్నారు. ఆదివారం ఉదయం అత్తవారి గ్రామమైన కరజాడ వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. రామారావుకి భార్య, రెండు నెలల చిన్నారి ఉన్నారు. ప్రసాద్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రాజమ్మ యాత్రలో భక్తుడు..

గార: వత్సవలస రాజమ్మ యాత్రకు వచ్చిన భక్తుడు ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు సరుబుజ్జిలి మండలం పాలవలస గ్రామానికి చెందిన అల్లాడ సింహాచలం(38) కుటుంబస సభ్యులతో వత్సవలస యాత్రకు శనివారం సాయంత్రం వచ్చాడు. ఆదివారం వేకువ జామున సముద్ర స్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకుని తాము బస చేసిన చోటకు చేరుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. సింహాచలం భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువకుడికి గాయాలు

మెళియాపుట్టి: దీనబంధుపురం పంచాయతీ కుద్దబ గ్రామానికి చెందిన లుగలాపు మధు అనే యువకుడు ఆదివారం ఉదయం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. యువకుడి తండ్రి భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి శ్రీకాకుళంలో గ్రూప్-2 పరీక్షలకు వెళుతుండగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆటో ఢీకొని కాలు విరిగిపోయినట్లు చెప్పారు. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. దీనిపై శ్రీకాకుళం పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు తండ్రి తెలిపారు.

అక్కకు తలకొరివి పెట్టిన చెల్లెలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న చెల్లెలు చిన్నమ్మి

టెక్కలి: అనారోగ్యంతో మృతిచెందిన అక్కకు ఓ చెల్లెలు తలకొరివి పెట్టిన ఘటన ఆదివారం టెక్కలి మండలం నర్సింగపల్లి పంచాయతీ కొల్లివలస గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కడియాల రాంబాయి(60) ఒంటరి మహిళగా జీవనం సాగిస్తోంది. అనారోగ్యంతో శ్రీకాకుళం జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. అయితే ఆమెకు దహన సంస్కారాలు చేసేందుకు ఎవరూ లేకపోవడంతో ఆమె చెల్లెలు చిన్నమ్మి వచ్చి ఆ ప్రక్రియను నిర్వహించింది. రాంబాయి మృతితో కుటుంబసభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు.

12.7 కిలోల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం: రైల్వే ప్రయాణి కుల ముసుగులో ముగ్గురు వ్యక్తులు 12.7 కిలోల గంజాయి తర లించేందుకు ప్రయత్నించి పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు ఆదివారం సర్కిల్ కార్యాలయంలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రూ.25 వేలు విలువ గల 12.7 కిలోల గంజాయి మూటలు తరలిస్తున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణకు సమాచారం రావడంతో సిబ్బంది దాడులు జరిపారు. శనివారం సాయంత్రం 4.20 గంటల సమయంలో రైల్వే ఎల్‌సీ గేటు వద్ద నిఘా వేశారు. కారులో గంజాయి మూటలతో వస్తుండగా తనిఖీలు చేయడంతో పట్టుబడ్డారు. దీంతో గంజాయితోపాటు కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురానికి చెందిన సమీరా బిస్వాయ్, దిగపుంటి బ్లాక్ కే నౌగాం గ్రామానికి చెందిన జితేంద్ర ప్రధాన్, కొత్తకోట చంద్రన్ సుబుద్ధి ముగ్గురూ ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయితో ఇచ్ఛాపురం చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు సిద్ధమై రైల్వే స్టేషన్‌కు సమీపంలో గల ఎల్‌సీ గేటు వద్ద అనుమానంగా కనిపించడంతో పట్టుకున్నారు. సీఐ ఇమ్మాన్యుయల్ రాజు, పట్టణ, రూరల్, కవిటి ఎస్ఐలు ఉన్నారు.

'రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ'

జి.సిగడాం: వైసీపీ ప్రభుత్వం బటన్ నొక్కుడే తప్పా రాష్ట్రాన్ని గాలికొదిలేసిందని విజయనగరం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) విమర్శించారు. ఆదివారం పాలఖండ్యాంలో ఓ ప్రవేట్ కార్యక్రమానికి హాజరై అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో విధ్వంసక పాలనకు ఆజ్యంపోస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం, నాయకులు మీసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే చెట్టుపొదిలాం, కప్పరాం, నల్లిపేట, మదుపాం, వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, దవళపేట, పాలఖండ్యాం గ్రామాల్లో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు.

గురువులకు సత్కారం



ఆమదాలవలస: తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఇందుకు నగరంలోని చిన్నకృష్ణాపురం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వేదికగా నిలిచింది. 1988-89 ఏడో తరగతికి చెందిన విద్యార్థులు అందరూ కలిసి ఆదివారం తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలివాడ ప్రసాదరావు, కుసుకుమారి, తవిటమ్మ, ఆచార్యులు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎరక్క పోయి వచ్చి... ఇరుక్కుపోయి



నరసన్నపేట: విశాఖ నుంచి గుణుపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్థానిక గొట్టిపల్లి అండర్ పాసేజ్‌లో ఇరుక్కు పోయింది. ఆదివారం సాయంత్రం విశాఖ నుంచి వచ్చిన బస్సు నరసన్నపేట పట్టణంలోకి సర్వీసు రోడ్డులో వెళ్లాల్సి ఉంది. అయితే డ్రైవర్ కొత్త కావడంతో సర్వీస్ రోడ్డులో వెళుతూ గొట్టిపల్లి అండర్ పాసే జ్‌లో దూరింది. ఎత్తు తక్కువ కావడంతో అక్కడ చిక్కుకుంది. దీంతో బస్సు టైర్‌లో గాలిని తొలగించి నెమ్మదిగా బయటకు తీశారు. ఆ సమయంలో 36 మంది ప్రయాణికులున్నారు. సుమారు అరగంట సేపు శ్రమించి బయటకు తీయగా ఆ తరువాత గుణుపూర్ బయలు దేరింది. ఈ ఘటనలో గొట్టిపల్లి మార్గంలో వెళ్లే వాహనాలు నిలిచి పోయాయి. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.


జి.సిగడాం: గొబ్బూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు


సారవకోట మండలం కిన్నెరవాడలో..


పొందూరు: కింతలిలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో నాయకులు

టీడీపీతోనే బహుజనులకు గుర్తింపు

- ఎమ్మెల్యే బెందాళం అశోక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: రాష్ట్రంలో బహుజనులను గుర్తించి అధిక స్థానాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎంపిక చేసిన పార్టీ టీడీపీ అని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని స్వగృహం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ-జనసేన పార్టీ 99 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించటం ప్రజామోదం పొందిన వారే నన్నారు. ఈ స్థానాల్లో 15 శాతం మంది మహిళలకు కేటాయించినట్టు తెలిపారు. షెడ్యూల్డ్ కులం నుంచి 19 మందిని ఎంపిక చేశారన్నారు. 63 మంది పట్టభద్రులు, ముగ్గురు వైద్యులు ఉన్నారంటే ప్రజల ప్రయోజనాల కోసం పార్టీ అధినేత ఎంతగా పాటుపడాలని కృషిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఒకేసారి ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించడంతో వైసీపీ శ్రేణుల్లో వణుకు పుడుతుందన్నారు. ఈయనతో పార్టీ మండల అధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాబు సూపర్ సిక్స్‌తో సంక్షేమ పాలన

జలుమూరు (సారవకోట): టీడీపీ ప్రకటించిన బాబు సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. కిన్నెరవాడ, గోపాలపురం గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహిం చారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తర్ర లచ్చుము, మట్ట గోవిందరావు, చల్ల జనార్దన, ఇప్పిలి సత్యం, ఇప్పిలి చంద్రయ్య, బలగ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

జి.సిగడాం: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి టంకాల మౌళీశ్వర రావు అన్నారు. ఆదివారం డీఆర్ వలస, గొబ్బూరు, టీడీ వలస, పెంట, దవళపేట, వాండ్రంగి తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహదాశ్యం చిన్నారావు, నాయకులు పైల రామకృష్ణం నాయుడు, కంచరాన సూరన్నాయుడు, మీసాల అశోక్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ఇచ్ఛాపురం: విజన్ ఉన్న నాయకుడు అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు అన్నారు.


ఇచ్ఛాపురం: కేశుపురంలో అవగాహన కల్పిస్తున్న మాజీ ఎంపీపీ

ఆదివారం కేశుపురం, నీలాపుట్టుగ గ్రామాల్లో బాబు సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, డి.కామేశ్వరరావు, నూకరాజు, కమలమ్మ, మోహనరావు, పుణ్యవతి, ఊహ, జానకమ్మ, ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కింతలిలో బాబు ష్యూరిటీ..

పొందూరు: మండలంలో అతిపెద్ద గ్రామమైన కింతలిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పైడి రామప్రసాద్, ఎంపీటీసీ కె.హనుమంతురావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

50 వేల మెజార్టీతో అచ్చెన్న హ్యాట్రిక్ సాధించాలి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని అభినందించిన క్యాడర్
- మిఠాయిలు తినిపించిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 25: టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ తరఫున ఆరోసారి పోటీ చేస్తున్న అచ్చెన్నాయుడును 50వేల మెజార్టీతో గెలిపించి హ్యాట్రిక్ సాధించాలని టీడీపీ క్యాడర్ ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ అభ్యర్థిగా అచ్చెన్నాయుడును పార్టీ అధిష్ఠానం ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం నిమ్మాడ, కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయంలో ఆయనను పలు మండలాల నేతలు, కార్యకర్తలు కలిసి అభినందించారు. మిఠాయిలు పంచిపెట్టడంతో పాటు కేక్‌లను కట్ చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బాబాయ్ అచ్చెన్నాయుడుకు ఎంపీ రామ్మోహన్ నాయుడు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. నేతలు చౌదరి బాబ్జీ, బోయిన రమేష్, బగాది శేషగిరి, కింజరాపు హరిప్రసాద్, వెలమల విజయలక్ష్మి, నంబాళ్ల శ్రీనివాసరావు, పినకాన అజయ్‌కుమార్, మళ్ల బాలకృష్ణ, జీరు భీమారావు, హరిబాబు తదితరులున్నారు.


బాబాయ్‌కి మిఠాయి తినిపిస్తున్న ఎంపీ రామ్మోహన్

టీడీపీలో రెండు పంచాయతీల నేతల చేరిక

సంతబొమ్మాళి: ఉమిలాడ పంచాయతీ కొవిరిపేట, మూలపేట సందిపేట గ్రామానికి పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొవిరిపేటకి చెందిన డి.దుర్గారావు, చిన్నరావు, ఎల్.నూకరాజు, ఎ.లక్ష్మణరావు, ఎం.అప్పలస్వామి, జంగమయ్య, బలరాం, చిన్నా, లక్ష్మణ, గణేష్, అప్పలస్వామి, రామారావు, జగదీష్, అప్పారావు, దుర్గారావు తదితరులున్నారు. అలాగే సందిపేట గ్రామానికి చెందిన బుడ్డెపు సంతోష్, జీరు శ్రీను, బుడ్డెపు లక్ష్మణ్, బొంగు జీవన్, రాము, రోహిత్, సుధాకర్, శంకర్, త్రినాథ్, చంద్రనాయుడు, నవీన్, శేఖర్, లక్ష్మణరావు, జోగారావుతో పాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గాన్ని అచ్చెన్నాయుడు మాత్రమే అభివృద్ధి చేయగలరని, అందుకే వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో భూములకు రక్షణ కరువు

పాతపట్నం: వైసీపీ పాలనలో పాతపట్నంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. స్థానిక ఆలాంధ్ర రోడ్‌లో కోదూరు పంచాయతీ ప్రహరాజపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలో చెరువు గర్భం ఆక్రమణలకు గురైందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆయన సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. సుమారు 3 ఎకరాల వరకు చెరువు గర్భాన్ని చదును చేశారని రైతు నల్లి లక్ష్మణతో పాటు మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై కలమట తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 18లో చెరువుగర్భం సుమారు మూడెకరాలను యంత్రాలతో చదును చేసి కబ్జాకు పాల్పడుతున్నారని, తక్షణం ఆక్రమిత ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి అనుచరులు పాతపట్నంలో చేపడుతున్న ఆక్రమణలు పరాకాష్టకు చేరా యన్నారు. నాయకులు పైల లక్ష్మయ్య, సైలాడ సతీష్, రుంకు చలపతిరావు పాల్గొన్నారు.


ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీఎమ్మెల్యే కలమట

చంద్రబాబు సభకు తరలిరండి

గార: శ్రీకాకుళంలో ఈ నెల 26వ తేదీ సోమవారం జరిగే చంద్రబాబు రా.. కదలి రా టీడీపీ సభకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని మండల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం బలరాంపురం, శ్రీకూర్మం తదితర గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలు అభిమానులను కలిసి చంద్రబాబు పాల్గొంటున్న ఈ సభకు తరలి రావాలని కోరారు. పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి ఎ.చక్రధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు లోపింటి రాధాకృష్ణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి, శ్రీకూర్మం టీడీపీ ఇన్‌చార్జి కైబాడి రాజు, పార్టీ ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కోర సురేష్, మాజీ సర్పంచ్ కోరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

పొందూరు: అధికారపార్టీ వైసీపీ ప్రభుత్వం పెడుతున్న అడ్డంకులు ఇబ్బందులు దాటుకుని, టీడీపీ శ్రేణులు సైనికుల్లా ముందుకు సాగాలని రా.. కదలిరా మండల ఇన్‌చార్జి, జీఎం వలస ఎంపీపీ బొంగు సురేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవంతం అవుతున్న ఈ సభలకు భయపడి అధికార పార్టీ ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వడంలేదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గౌతు శిరీషను కలిసిన జనసేన నాయకులు


గౌతు శిరీషతో మాట్లాడుతున్న దానేటి శ్రీధర్

పలాస: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ను జనసేన నాయ కుడు డాక్టర్ దానే టి శ్రీధర్ ఆదివారం మర్యా దపూర్వకంగా కలుసు కున్నారు. టీడీపీ కార్యాలయంలో జన సన- టీడీపీ నాయకులు పార్టీ విజయా వకాశాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. శిరీషను కలిసిన వారిలో సంతోష్‌పండా తదితరులున్నారు.

'అడవులను విక్రయించేందుకే 2023 చట్టం'

పలాసరూరల్: అడవులను బహుళజాతి సంస్థలకు విక్ర యించేందుకే కేంద్ర ప్రభుత్వం 2023 అటవీ సంరక్షణ చట్టం తీసుకువచ్చిందని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు విమర్శిం చారు. లొత్తూరు పంచాయతీ హొల్దిగాంలో ఆదివారం విప్లవో ద్యమ నేత జయమ్మ నాలుగో వర్ధంతి సందర్భంగా 2023 అటవీ సంరక్షణ చట్టంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సహజ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం ఈ చట్టం తయారు చేసిందన్నారు. ముందుగా జయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, కార్యదర్శి బైరి కూర్మారావు, ఐఎఫ్ టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సౌర్ర రామారావు, కార్యదర్శి సోమేశ్వరరావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు బి.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పెట్టుబడిదారీ విధానాలను తరిమికొట్టాలి

పలాసరూరల్: దేశంలో ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు భరోసానిస్తూ పేద రైతు, శ్రామిక వర్గాలకు అన్యాయం చేస్తు న్నాయని, పోరాటాల ద్వారా వారిని తరిమికొట్టాలని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకుడు, ప్రొఫెసర్ ఖాసీమ్ అన్నారు. బొడ్డపాడు గ్రామంలో బొడ్డపాడు యువజనసంఘం 70వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. యువజన సంఘ అధ్యక్షుడు తామాడ క్రాంతి, కేఎన్‌పీఎస్ నాయకులు మిస్కా కృష్ణ య్య, రైతాంగ కమిటీ నాయకుడు దాసరి శ్రీరాములు, ఏబీఎం సభ్యులు తామాడ త్రిలోచనరావు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

జలుమూరు/నరసన్నపేట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శ్రీకాకుళంలో సోమవారం నిర్వ హించనున్న రా.. కదలిరా కార్యక్ర మానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్ చార్జి బగ్గు రమణమూర్తి కోరారు. చల్లవానిపేటలో ఆదివారం పార్టీ నేత లతో సమావేశం నిర్వహించారు. నరసన్నపేట నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చేలా కృషి చేయాలన్నారు. టీడీపీ, అనుబంధ సంఘాల ప్రతినిధులు దేవాది వద్దకు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకోవాలని కోరారు.

లక్ష్య సాధన దిశగా అడుగువేయాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం, విద్యార్థులకు పట్టాల ప్రదానం

శ్రీకాకుళం రూరల్: సాధించాలనుకున్న లక్ష్యాలను పట్టు వదలకుండా ప్రయత్నిస్తే విజయం మీ సొంతమవుతుందని సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఆసుపత్రి ఛైర్మన్ గురువారెడ్డి అన్నారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని సెమినార్ హాల్‌లో 2018 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవ సెమినార్‌ను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు ఆసక్తి గల రంగం వైపు పయనించాలని సూచించారు.

కానరాని చట్టబద్ధ పరిపాలన

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: రాష్ట్రంలో చట్టబద్ధ పరిపాలన లేదని టీడీపీ సీనియర్ నాయ కుడు, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిర్మాణ రంగానికి అవసరమైన ఇసుక విధానంలోనూ ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. టీడీపీ హయాంలో నీరు-చెట్టు చట్టాన్ని ప్రజలకు అందిస్తే.. వైసీపీ పాలనలో సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని విమర్శించారు. భూ గర్భజలాలు కూడా ప్రస్తుతం తగ్గిపోతున్నాయని నివేదికల ద్వారా వెల్లడవుతుంటే ఇటువంటి పరిస్థితుల్లో ఇసుక రేవులను కూడా పరిశీలన చేపట్టకపోవడం సరికాదన్నారు. పలాస, నైర, రామకృష్ణాపురం, కంచిలి ప్రాంతాల్లో ఆరు స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నామని భూగర్భ గనుల శాఖ వెల్లడించిందని, జిల్లాలో ఇసుక రీచ్‌లపై తొలిసారిగా కలెక్టర్ సమీక్ష నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

రోడ్డు గుంతలపై కోర్టుకు హాజరైన ఎస్ఈ

ఆమదాలవలస: జిల్లాలో గుంతలతో ఉన్న శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి దుస్థితిపై రోడ్లు భవనాలశాఖ చీఫ్ ఇంజనీర్ జాన్ సుధాకర్ కోర్టుకు హాజరైనట్టు న్యాయవాది బొడ్డేపల్లి మోహన్‌రావు ఆదివారం తెలిపారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి దుస్థితిపై ఇటీవల దాఖలు చేసిన పీఎల్‌సీ కేసు విషయంలో శనివారం ఎస్ఈ ఆమదాలవలస జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు హాజరైనట్టు మోహన్‌రావు తెలిపారు. న్యాయాధికారి ఎదుట హాజరైన ఎస్ఈ ఈ రహదారి గుంతలను తాత్కాలికంగా పూడ్చి వేసి చదును చేయడానికి అంగీకరించినట్టు తెలిపారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం రూ.14.83 కోట్లు బిల్లులు చెల్లింపులు చేపట్టాల్సి ఉందని, తదుపరి పనులు చేపట్టడానికి కోరిన గడువు మేరకు రోడ్డు పనులు ఈ ఏడాది జూన్ 25 నాటికి పూర్తి చేయగలమని ఆయన కోర్టుకు తెలిపినట్టు న్యాయవాది మోహనరావు తెలిపారు. దీనిపై ఆర్ అండ్‌బీ జేఈ నాయక్ మాట్లాడుతూ.. ఈ రోడ్డు విషయమై న్యాయవాది బొడ్డేపల్లి మోహన్‌రావు వేసిన కేసు విషయంలో ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ జాన్ సుధాకర్‌తోపాటు తాను హాజరైనట్టు తెలిపారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం

కాశీబుగ్గ: రాష్ట్రంలో వైసీపీ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని గద్దె దించడమే జనసేన లక్ష్యమని ఆ పార్టీ నాయకుడు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. కాశీబుగ్గలో ఆదివారం జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయం తథ్య మన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, నేతలు కోత పూర్ణ చంద్రరావు, కంచరాన అనిల్ పాల్గొన్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

పొందూరు: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (టీడీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మండల శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రిమ్స్‌లో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

అరసవల్లి: నేషనల్ హెల్త్‌మిషన్ ప్రాజెక్టులో భాగంగా స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల (రిమ్స్)లో రూ. 23.75 కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణా నికి ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్ నుంచి ఆయన దేశవ్యాప్తంగా హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రారంభాలు, శంకుస్థా పనలు చేశారు. శ్రీకాకుళంలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. లైవ్ టెలి కాస్ట్ ద్వారా కలెక్టర్, ఏపీ హెచ్ఎంఐడీసీ ఈఈ సత్యప్రభాకర్, సూపరిం టెండెంట్ స్వామి నాయుడు, డీఎంహెచ్‌వో బి. మీనాక్షి, డిప్యూటీ సూపరింటెండెంట్ కె.సునీల్ నాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటా చలం, హెచ్‌డీఎఫ్‌సీ సలహా సభ్యులు సుభాషిణి, ఎం.సత్యానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

రణస్థలం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చే యాలని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం కొండము లగాం పంచాయతీ ముక్తం పురం కొండ వద్ద అంబేడ్కర్ సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ రజిని, కుదిటి ఈశ్వరరావు, దువ్వాన అప్పలసూరి, కలిశెట్టి అప్పలనాయుడు, మల్లేశ్వరి, విశ్వమోహన్ రెడ్డి, కె.బాలమాన్‌సింగ్ పాల్గొన్నారు.

కాలువ భూముల ఆక్రమణలపై ఆగ్రహం

- ఆక్రమణదారులను నిలదీసిన ప్రజలు

పలాస: స్థానిక పద్మనాభపురం వద్ద కాలువ భూములు కప్పి విక్రయిస్తున్నారంటూ స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసి ఆక్రమణదారులను నిలదీసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి ఆనుకొని ఉన్న ఓ ప్రైవేటుకళాశాల వెనుక భాగంలో కొండపోరంబోకు భూమి ఉంది. వర్షాలు, తుఫాన్ సమయాల్లో కొండ నీరంతా ఈ కాలువ నుంచి ప్రవహించి గ్రామంలోని చెరువుకు చేరుకుంటుంది. అయితే కాలువ వెడల్పుగా ఉండడంతో కొందరు దానిని ఆక్రమించి కప్పి కొంతమేర విక్రయించారు. మిగిలిన భూమినైనా విడిచి పెట్టాలని గ్రామస్థులు కోరడంతో దాన్ని యథా తథంగా వదిలారు. అయితే మరికొందరు ఈ స్థలాన్ని సైతం ఆక్రమించే ప్రయత్నం చేయడంతో ప్రజలు అడ్డుకుని ఆక్రమణలు తొలగించాలని ఆక్రమణ దారులతో వాగ్వాదానికి


పద్మనాభపురంలో ఆక్రమిత స్థలం వద్ద వాగ్వాదం చేసుకుంటున్న దృశ్యం

దిగారు. తక్షణం ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులకు సోమవారం 'స్పందన'లో ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

దుర్మార్గ పాలనను అంతం చేద్దాం

● ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

అరసవల్లి, ఫిబ్రవరి 25: జగన్‌రెడ్డి అనే అక్రమార్కుడి దుర్మార్గాలను అంతం చేయడానికే 'రా.. కదలి..రా!' సభలు నిర్వహిస్తున్నామని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఈ సభలకు ప్రజలు నీరాజనం పడుతున్నారని, చంద్రబాబు పాలన కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలో చంద్రబాబు సభ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. సభా ప్రాంగణం, వేదిక, కళావేదిక, గ్యాలరీలను సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో జిల్లా మరింత వెనుకబడింది. జగన్ పాలన అంతం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల జాబితా ప్రకటనతో వైసీపీలో ఓటమి భయం మొదలైంది. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీని సాగనంపడం ఖాయం. చంద్రబాబు హయాంలో మళ్లీ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనిస్తుంద'ని స్పష్టం చేశారు. చంద్రబాబు సభకు తరలివచ్చిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పీఎంజె.బాబు, బొనిగి భాస్కరరావు, సింతు సుధాకర్, కొర్ను నాగార్జున ప్రతాప్, గొండు శంకర్, కొమ్మనాపల్లి వెంకట్రామరాజు, విభూది సూరిబాబు, కోరాడ హరగోపాల్, జామి భీమశంకరరావు, అరవల రవీంద్ర పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో చంద్రబాబు సభకు సిద్ధమవుతున్న వేదిక

సిక్కోలులో రా.. కదలి రా!

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం జిల్లాకు రానున్నారు. శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో 'రా.. కదలిరా' పేరిట నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పాల్గొనున్నారు. టీడీపీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయనున్నారు. తెలుగుదేశం-జనసేన కూటమిని గెలిపించాలని.. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే వాటిల్లే ఉపద్రవాన్ని ప్రజలకు స్వయంగా వివరించనున్నారు. వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. ఈ నేపథ్యంలో 'యుద్ధభేరి' పేరిట చంద్రబాబునాయుడు గతేడాది ఆగస్టు 10న జిల్లాలో పాతపట్నం నియోజకవర్గంలో పర్యటించారు. ఆ తర్వాత జిల్లాలో మూడుసార్లు చంద్రబాబు పర్యటన ఖరారైనా.. అనివార్య కారణాలతో రద్దయ్యాయి. తాజాగా.. 'రా.. కదలిరా' పేరిట కార్యక్రమానికి చంద్రబాబు హాజరుకానున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించిన తర్వాత.. తొలిసభ సిక్కోలు నుంచే ప్రారంభం కావడంతో అధినేత పర్యటనను విజయవంతం చేసేందుకు తెలుగుతమ్ముళ్లు సన్నాహాలు చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా టీడీపీ శ్రేణులు, అభిమానులు, సాధారణ జనం తరలివచ్చేలా రూపకల్పన చేశారు. శ్రీకాకుళంలో ఎనభై అడుగుల రోడ్డు పక్కన ఖాళీస్థలంలో లక్షమందికిపైగా సరిపడేలా సభా ప్రాంగణాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా టీడీపీ శ్రేణులతోపాటుగా ఉత్తరాంధ్ర నాయకులంతా శ్రీకాకుళంలోనే మోహరించారు.

చంద్రబాబు పర్యటన ఇలా...

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హెలీకాప్టర్‌లో శ్రీకాకుళం రానున్నారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు. మధ్యాహ్నం 2.45గంటలకు శ్రీకాకుళంలో కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఆర్‌అండ్‌బీ మైదానంలో ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 2.55 గంటలకు రోడ్డు మార్గంలో హెలీప్యాడ్ నుంచి బయలుదేరి 3 గంటలకు ఎనభైఅడుగుల రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన 'రా కదలిరా' సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3 గంటల నుంచి 4.30 గంటల వరకు సభలో ప్రసంగిస్తారు. 4.45 గంటలకు రోడ్డు మార్గంలో శ్రీకాకుళం నుంచి బయల్దేరి సాయంత్రం 6.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడ 6.40 గంటలకు విమానంలో బయలుదేరి 7.30గంటలకు విజయవాడ వెళ్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో రాత్రి 8.30 గంటలకు ఉండవల్లి చేరుకుంటారు.

● నేడు జిల్లాకు రానున్న చంద్రబాబునాయుడు
● లక్ష మందితో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
● అభ్యర్థులను ప్రకటించాక టీడీపీ అధినేత తొలిసభ ఇదే
● అటు ప్రచారం.. ఇటు తెలుగు తమ్ముళ్లకు దిశానిర్దేశం
● పర్యటన విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణుల సన్నాహాలు

● ఆ నియోజకవర్గాల్లో ఏకతాటికి తేవాల్సిందే

సిక్కోలు.. టీడీపీకి కంచుకోట. 2019లో జగన్‌కు ఇచ్చిన ఒక్కచాన్స్ కారణంగా సాధారణ జనం వైసీపీకి ఓటేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు.. టీడీపీ హయాంలో మినహా కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టకపోవడం.. ఆపై అధికార పార్టీ నాయకుల్లో వర్గపోరు టీడీపీకి కలిసివస్తున్నాయి. ఎనిమిది నియోజకవర్గాల్లోనూ టీడీపీకి ఆదరణ మరింత పెరిగింది. దీనికితోడు జనసేన కూడా పొత్తుగా కలసివచ్చింది. దీంతో జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తామే గెలుపొందుతామన్న ధీమా టీడీపీ నాయకుల్లోనూ చోటుచేసుకుంది. అధికార పార్టీని ఎదుర్కోవాలంటే టీడీపీ శ్రేణులు కలసికట్టుగా వెళ్తేనే సాధ్యమవుతుందన్న విషయం మరిచి పోతున్నారు. జిల్లాలో కొన్నిచోట్ల టీడీపీలోనే బహునాయకత్వం చోటుచేసుకుంది. ఎవరికివారుగా పార్టీ కార్యక్రమాలు చేసేస్తున్నారు. నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో జరగాల్సిన కార్యక్రమాలను కూడా వేర్వేరుగా చేసుకుపోతున్నారు. దీంతో టీడీపీలోనూ రెండు వర్గాలున్నాయి.. ఆ వర్గాల్లో టీడీపీ అధిష్ఠానం ఒకరికి సీటు ఇస్తే.. మరో వర్గం వల్ల తమకు ప్రయోజనం కలుగుతుందని వైసీపీ నేతలు గంపెడాశతో ఉన్నారు. శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి గోచరిస్తోంది. ఈ ప్రాంతాల్లో గతం కంటే టీడీపీకి ఆదరణ గణనీయంగా పెరగ్గా.. నేతల మధ్య మాత్రం సమన్వయం లోపిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఒకే నియోజకవర్గంలో ఇద్దరేసి నాయకులు టికెట్ కోసం ఆశిస్తుండడంతో.. టీడీపీ అభిమానులు ఎవరివైపు ఉండాలనే విషయమై గందరగోళానికి గురవుతున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో కూడా చాపకింద నీరులా టీడీపీలో రెండో వర్గం కొంత బలపడింది. టీడీపీ అధినేత ఇటువంటి పరిణామాలను సరిచేసి.. పార్టీ శ్రేణులందరినీ ఏకతాటిపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మెజార్టీ కోల్పోకుండా అన్ని సీట్లను కైవసం చేసుకునేలా టీడీపీ నాయకులందరినీ సమన్వయం చేయాలని కోరుతున్నారు.

విజయవంతం చేయాలి: అచ్చెన్న

టెక్కలి, ఫిబ్రవరి 25: శ్రీకాకుళంలో సోమవారం నిర్వహించనున్న చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ, జనసేన శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. సభకు జిల్లా నలుమూలల నుంచి రెండు లక్షల మంది వరకు జనసమీకరణ చేయాలని సూచించారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో సెక్షన్, బూత్ యూనిట్, క్లస్టర్, సెంట్రల్ కమిటీ సభ్యులు హాజరు కావాలన్నారు. చంద్రబాబుకు భారీ స్థాయిలో ప్రజలు స్వాగతం పలికే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని తెలిపారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలో పదివేల ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని వెల్లడించారు.



టెక్కలిలో టీడీపీలో చేరిన వారితో విజయ సంకేతం చూపిస్తున్న అచ్చెన్నాయుడు

వైసీపీ నుంచి టీడీపీలోకి..

● టెక్కలికి చెందిన 500 కుటుంబాలు చేరిక

టెక్కలి, ఫిబ్రవరి 25: ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీలో భారీ చేరికలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో టెక్కలి మేజర్‌పంచాయతీ రెండు శేరివీధులు, సోగ్గాడిపేట, రెడ్‌క్రాస్ వీధి, మండాపోలం కాలనీ, మెట్టవీధి, బ్రాహ్మణవీధి, గోపీనాథపురం తదితర ప్రాంతాల నుంచి 500కు పైగా కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. డొంకాన రామకృష్ణ, భాస్కర్‌జెన్నా, కోళ్ల రామాంజనేయులు, ఉప్పిడి ఎర్రన్న, తేట గోపి, లింగుబారి వేణు, జానీ, కోళ్ల సాయిరాం, నానుబోలు మోహనరావుతో పాటు టెక్కలి మేజర్‌పంచాయతీ గోపీనాథపురానికి చెందిన వార్డు సభ్యులు లోకనాథం తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 50రోజులు ఓపిక పట్టాలని, త్వరలో టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి అధికారం చేపట్టనుందన్నారు. 'ఐదేళ్లల్లో రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి సర్వనాశనం చేశారు. టెక్కలిలో నేను చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేక కొంతమంది దుష్టశక్తులు అనేక పన్నాగాలు పొందుతున్నారు. రోడ్లు విస్తరణ చేసి విస్తరణలో నష్టపోయిన వారికి హుద్‌హుద్ ఇళ్ల కాలనీ ఇస్తామని హామీ ఇస్తే.. అధికార పార్టీ నాయకులు కొందరు ఆ ఇళ్లను స్థానికేతరులకు అమ్ముకున్నారు. గడిచిన ఐదేళ్లలో టెక్కలిలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా అధికార పార్టీ చేపట్టలేదు' అని అచ్చెన్న ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రానికి దీటుగా టెక్కలి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బగాది శేషగిరి, కింజరాపు ప్రసాద్, బోయిన రమేష్, బోయిన గోవిందరాజులు, వెలమల విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

● 24,500 మంది అభ్యర్థులకు గానూ 20,554 మంది హాజరు

● 3,946 మంది గైర్హాజరు



నరసన్నపేటలో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు

శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/ నరసన్నపేట/ శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 25: జిల్లాలో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 87.71శాతం హాజరు నమోదైంది. ఆదివారం జిల్లాలో సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, కొత్తూరు, ఆమదాలవలస, శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల తదితర పట్టణాల్లో మొత్తంగా 82కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 24,500మంది అభ్యర్థులకుగాను 20,554 మంది హాజరయ్యారు. 3,946 మంది గైర్హాజరయ్యారు. 2019లో గ్రూప్-2 పరీక్షకు 15 వేల మంది దరఖాస్తు చేసుకోగా.. కేవలం 9,600 మంది అభ్యర్థులు(63.45)శాతం హాజరయ్యారు. ఈఏడాది భారీగా దరఖాస్తు చేసుకోగా 87.71శాతం మంది పరీక్షలు రాశారు. చివరి నిమిషం వరకు అభ్యర్థులు ఉరుకులు.. పరుగులతో పలు కేంద్రాలకు చేరుకున్నారు. కొంతమందికి సుదూర ప్రాంతాల్లో కేంద్రాలను కేటాయించడంతో.. సకాలంలో చేరుకునేందుకు అవస్థలు పడ్డారు. 40ఏళ్ల వయసులోనూ చాలామంది పరీక్ష రాశారు. నరసన్నపేటలోని 8కేంద్రాల్లో పలువురు పంచాయతీ కార్యదర్శిలు పరీక్షకు హాజరయ్యారు. అలాగే దివ్యాంగులు పలు కేంద్రాల్లో స్క్రైబ్ సహాయంతో పరీక్షలు రాశారు. పోలీసులు గుర్తింపు కార్డులను పరిశీలించి పరీక్షా కేంద్రాల్లోనికి విడిచిపెట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు సౌకర్యం కల్పించగా, వైద్యఆరోగ్య సిబ్బంది సేవలను అందించారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ నవీన్, ఎస్పీ రాధిక పరిశీలించారు. అభ్యర్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టారు. బందోబస్తు నిర్వహించిన సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయని తెలిపారు. ఆమె వెంట డీఎస్పీ వై.శృతి, సీఐ ఎల్.ఎస్.నాయుడు తదితరులు ఉన్నారు.





శ్రీకాకుళంలో పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, ఎస్పీ రాధిక

పేదల బియ్యాన్నీ వదలరా?

● చనిపోయిన వారి పేరిట రేషన్ పక్కదారి

● అంత్యోదయ కార్డులే టార్గెట్

● లంకపేటలో వలంటీర్లు, వాహనదారుడు కుమ్మక్కు

రణస్థలం, ఫిబ్రవరి 25: వలంటీర్లతో సుపరిపాలన అందిస్తున్నానని సీఎం జగన్ చెబుతున్నారు. ఇంటింటా రేషన్ పంపిణీ చేస్తూ దేశంలోనే అత్యుత్తమ సేవలందిస్తున్నారని మంత్రుల నుంచి గ్రామస్థాయి నేతల వరకూ ప్రగల్భాలు పలుకుతున్నారు. కాగా కటిక నిరుపేదలకు అందించే అంత్యోదయ బియ్యాన్ని.. రేషన్ వాహనదారుడితో కుమ్మక్కై వలంటీర్లు పక్కదారి పట్టించారు. చనిపోయిన లబ్ధిదారుల పేరిట కైంకర్యం చేశారు. రణస్థలం మండలం రావాడ పంచాయతీ లంకపేటలో ఈ అవినీతి వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. లంకపేటకు చెందిన అంత్యోదయ రేషన్‌కార్డు(వైఏపీ010701300021 నంబరు) లబ్ధిదారుడు లంక అసిరయ్య ఏడాది కిందట మృతి చెందాడు. అయినా ప్రతినెలా ఆయన పేరిట రేషన్ బియ్యం విడుదల అవుతుండడం గమనార్హం. మరో లబ్ధిదారు కిల్లారి అప్పమ్మ (వైఏపీ 010701300139) రెండేళ్ల కిందట చనిపోయింది. ఆమె పేరిట ప్రతినెలా 35కిలోల బియ్యాన్ని పక్కదారి పట్టించినట్టు తెలుస్తోంది. అలాగే సిరిపురపు చిలకమ్మ మృతి చెంది రెండు నెలలైంది. ముగుది వరలక్ష్మి పేరిట గతేడాది జనవరి 9న డెత్ సర్టిఫికెట్ మంజూరైంది. వీరి పేరిట కూడా ప్రతినెలా బియ్యం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కిల్లారి శిమ్మమ్మ మృతి చెంది ఏడాదైనా.. ఆమె పేరిట 35కిలోల చొప్పున బియ్యం విడుదల చేసినట్టు సమాచారం. వలంటీర్లు, రేషన్ వాహనదారుడు కుమ్మక్కై ఈ అక్రమ పర్వానికి తెరదీశారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై రెవెన్యూ అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● ఈ విషయమై తహసీల్దార్ రామారావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. విచారణ చేపడతామని తెలిపారు. మృతుల పేరిట రేషన్ బియ్యం మంజూరైనట్టు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కార్డులు తొలగిస్తామని స్పష్టం చేశారు.



సందడిగా రాజమ్మ యాత్ర

గార మండలం వత్సవలసలో రాజరాజేశ్వరి(రాజమ్మ) యాత్ర ఆదివారం సందడిగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రాజమ్మను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రే ఆటోలు, ఇతర వాహనాల్లో గ్రామానికి చేరుకుని బస చేశారు. ఆదివారం ఉదయం సముద్ర స్నానాలు రాజమ్మకు ముడుపులు చెల్లించుకున్నారు. మైలపిల్లి పేరయ్య దాసుడు, శ్రీనివాస్ దాసుడు పీఠాలతోపాటు ఇతర రాజమ్మ పీఠాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. సీఐ ఎల్ఎస్ నాయుడు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. - గార

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

మాఘమాసం ఆదివారం పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే క్యూలో బారులుదీరారు. ఆలయంలోని సూర్య నమస్కారాల మండపం భక్తులతో నిండిపోయింది. కేశఖండన శాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో స్వామికి తలనీలాలు సమర్పించారు. ఆదివారం ఒక్క రోజు స్వామికి రూ.9,56,537 ఆదాయం లభించింది. ఇందులో టికెట్ల అమ్మకం ద్వారా రూ.4,72,300, విరాళాల ద్వారా రూ.1,79,237, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.3,05,000 లభించిందని ఈవో రమేష్‌బాబు తెలిపారు. - అరసవల్లి

